సాక్షి జనగామ

మంగళవారం | 29 | అక్టోబర్ | 2024



భద్రు వెనుక బడా నాయకులు?

ఉమ్మడి వరంగల్ జిల్లాలో నకిలీ పట్టాదార్ పాస్‌పుస్తకాల తయారీ ముఠాలో ప్రధాన సూత్రధారి భద్రు వెనుక బడా నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. - 10లో



కళాకారుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి - 10లో

తెలంగాణ కళాకారుల విగ్రహాలను కాళోజీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం $34^0/21^0$

వాతావరణం

ఉదయం నుంచి పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి. రాత్రి పూట చలి తీవ్రత కొంత మేర ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఆర్యన ఎంపిక



చిల్పూరు: పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చిదురాల ఆర్యన ఖోఖో అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం కేతిడి నర్సింహారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు దేవ్‌సింగ్ తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 20న వరంగల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్యన నవంబర్ 3న కామారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

2న బీసీ కమిషన్ సభ్యుల రాక

హన్మకొండ అర్బన్: స్థానిక సంస్థల రిజర్వేషన్ల కల్పనపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా నవంబర్ 2వ తేదీన హనుమకొండ కలెక్టరేట్‌కు బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం రానున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి పాల్గొననున్నట్లు వివరించారు. నవంబర్ 2న ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు హనుమకొండ, వరంగల్ జిల్లాలకు, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు భూపాలపల్లి, ములుగు జిల్లాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు మహబూబాబాద్, జనగామ జిల్లాలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరిస్తారని వివరించారు. రూ.20 జ్యుడీషియల్ స్టాంపు పేపర్‌పై ప్రమాణ పత్రం, ప్రభుత్వ నోటరీ అడ్వకేట్ సంతకంతో తమ అభిప్రాయాలను, విజ్ఞప్తులను కమిషన్ బృందానికి సమర్పించాలని సూచించారు.

నూతన బస్సులు ప్రారంభం

జనగామ: జనగామ డిపోకు కొత్తగా రెండు పల్లె వెలుగు బస్సులు రాగా వాటిని సోమవారం ఏఎంటీ హుస్సేన్, టీఐ ఎం.ముత్తయ్య ప్రారంభించారు. బస్సులకు పూజలు చేసిన అనంతరం ఆయా రూట్లకు పంపించారు.

మేనిఫెస్టో అమలుకు పోరాటం



జనగామ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు సంబంధించి మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల అమలు, సమస్యల పరిష్కారానికి పోరాటం తప్పదని ఆశ కార్యకర్తల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు రావుల సంతోష అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింగం అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశ కార్యకర్తలకు ఉద్యోగభద్రత కల్పించడతోపాటు సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు రాధ, శోభ, విజయ, మంజుల, రేణుక, రమ, సునీత, భాగ్య, రమాదేవి, రజిత, స్వప్న సౌజన్య, సునిత తదితరులు పాల్గొన్నారు.

జనగామ ఆర్డీఓగా గోపీరామ్

జనగామ: జనగామ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్(ఆర్డీఓ)గా కె.గోపీరామ్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న ఆర్డీఓ కొమురయ్య హనుమకొండ జిల్లా పౌరసరఫరాల శాఖకు డిప్యుటేషన్‌పై బదిలీ అయ్యారు.

ఓటరు డ్రాఫ్ట్ అందుబాటులో ఉంచాలి

జనగామ రూరల్: ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ–2025 ప్రాథమిక ప్రచురణ డ్రాఫ్ట్ అందుబాటులో ఉంచాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. వాటిని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిధి నిర్దేశిత పోలింగ్ స్టేషన్లలో ప్రదర్శించాలన్నారు. జిల్లాలో ఇంతకు ముందు 861 పోలింగ్ స్టేషన్లు ఉన్నప్పటికీ కొత్తగా నాలుగు చేర్చడంతో సంఖ్య 865కి పెరిగిందన్నారు. జనవరి నాటికి వయసు 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఫారం 6లో ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎపిక్ వివరాల్లో మార్పులు లేదా ఇతర ఓటరు సంబంధిత సమస్యలు ఉంటే సంబంధిత ఈఆర్ఓ, ఏఈఈఆర్ఓ తహసీల్దార్ లేదా బీఎల్ఓలను సంప్రదించవచ్చని సూచించారు. ఈ ప్రాథమిక డ్రాఫ్ట్ ప్రతులు ఈఆర్ఓ, తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంటాయని, ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

మసే మిగిలింది..

మొండి గోడలు.. కాలిన వస్త్రాలు

- కళావిహీనంగా మారిన షాపింగ్ మాల్స్
- మంటలు, పొగలతో 36 గంటలు టెన్షన్
- నాలుగు ఫైర్ ఇంజన్లతో నాన్ స్టాప్..
- కొనసాగుతున్న పోలీసు పహారా
- వ్యర్థాల తొలగింపు ముమ్మరం
- కాలిన దుస్తుల సేకరణలో ప్రజలు



అగ్ని ప్రమాదం అనంతరం మొండి గోడలతో కనిపిస్తున్న షాపింగ్ మాల్స్

విద్యుత్ దీపాల వెలుగులతో కనిపించిన షాపింగ్ మాల్స్ స్థానంలో పొగబారిన మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. వందలాది మంది కస్టమర్లతో కళకళలాడిన దుకాణాలు.. కాలిపోయి ముద్దగా మారిన వస్త్రాల కుప్పలు, దగ్ధమైన వస్తువులు, బట్టల వ్యర్థాలను తొలగించే సిబ్బందితో కళావిహీనంగా మారాయి. ఈ దృశ్యాలు సిద్దిపేట రోడ్డులో అగ్నిప్రమాదం సంభవించిన విజయ, శ్రీ లక్ష్మి షాపింగ్ మాల్స్ వద్ద సోమవారం కనిపించాయి.

జనగామ: పట్టణంలోని రెండు షాపింగ్ మాల్స్.. ఒక రెడీమేడ్ వస్త్ర దుకాణం దగ్ధమైన ఘటనలో మంటలు, పొగలు 36 గంటల పాటు ఆగకుండా ఆందోళన కలిగించాయి. ఈనెల 27వ తేదీ రాత్రి నుంచి నాలుగు ఫైర్ ఇంజన్లు వాటర్ పంపింగ్ చేస్తున్నా.. స్వల్పంగా మంటలు చెలరేగుతూనే ఉన్నాయి. దీంతో పోలీసులు షాపింగ్ మాల్స్ వద్ద నిరంతరం పహారా ఉన్నారు. భవనం ప్రమాదకరంగా మారడంతో ప్రజలు అటు వైపు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు అగ్నిప్రమాదంలో కాలిపోయిన వస్త్రాల నుంచి పొగలు రావడంతో ఫైర్ ఇంజన్ల సహాయంతో భవనం రెండు వైపుల నుంచి వాటర్ స్ప్రే చేశారు. షాపింగ్ మాల్స్ దగ్ధమైన విషయం తెలుసుకున్న ప్రజలు వేలాదిగా తరలి రావడంతో స్వర్ణ కళామందిర్ జంక్షన్ నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భవన స్థితిగతులను ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన అధికారులు పరిశీలించగా.. ప్రమాదానికి కారణాలను ఇంకా తెలుసుకునే పనిలో ఫోరెన్సిక్ నిపుణులు నిమగ్నమయ్యారు. భవనం కూల్చుడా లేక ఇంకేమైనా చర్యలు తీసుకుంటారా అనేది అధికారులు వెల్లడించాల్సి ఉంది. కాగా అత్యవసర సమయంలో ఎలాంటి ప్రమాదం జరగకుండా రెండు ఫైర్ ఇంజన్లను అక్కడే ఉంచారు.



కాలిన వస్త్రాలను ఏరుకుంటున్న ప్రజలు



షాపింగ్ మాల్స్ వద్ద గుమిగూడిన జనం

వ్యర్థాలను తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు

షాపింగ్ మాల్స్, రెడీమేడ్ బట్టల దుకాణంలో కాలి బూడిదైన వస్త్రాలు, ఇతర ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను మున్సిపల్ కార్మికులు తొలగించే పనిలో ఉన్నారు. భవనం ప్రమాదకరంగా మారడంతో కార్మికులు సైతం భయంగా పనులు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. కాలిపోయిన పట్టుచీరలు, రెడీమేడ్ దుస్తులు, ఇతర వస్త్రాలను దుకాణాల ఎదుట కుప్ప పోయడంతో పలువురు అక్కడికి చేరి వాటిని తీసుకువెళ్తున్నారు. మహిళలు, ప్రజలు ఉదయం నుంచి రాత్రి వరకు అదే పనిలో ఉన్నారు.

అండగా ఉంటా : ఎమ్మెల్యే 'పల్లా'

అధైర్య పడకండి.. అండగా ఉంటానని అగ్నిప్రమాద బాధితులకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. కాలిపోయిన షాపింగ్ మాల్స్‌ను సోమవారం పరిశీలించిన ఆయన యజమానులను ఓదార్చారు. ఎస్‌ఆర్ బ్రదర్స్ షాపు యజమాని తండ్రి లక్ష్మీనారాయణ గుండె పోటుతో మృతిచెందగా.. ఎమ్మెల్యే ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో కోట్ల రూపాయల నష్టం జరిగిందని, తన వంతుగా బాధితుల పిల్లల చదువుకు సహకారం అందిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి కొత పరిహారం ఇస్తే బాగుంటుందని, ఇన్సూరెన్స్ లేని వారికి సర్కారు అండగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, కౌన్సిలర్లు ప్రేమలతారెడ్డి, దయాకర్, వాంకుడోతు అనిత, పేర్ని స్వరూప, బాల్దె కమలమ్మ, భూలక్ష్మీనాగరాజు, విజయ్ తదితరులు ఉన్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే 'పల్లా'

కమిషనర్‌పై కౌన్సిల్ కన్నెర్ర

- సమస్యలపై నిలదీసిన సభ్యులు
- టేబుల్ ఎజెండాలో వివక్ష ఎందుకు
- ఎల్‌ఆర్‌ఎస్ వివరాలు ఇవ్వరెందుకు
- వాడీవేడిగా పురపాలిక సర్వసభ్య సమావేశం

జనగామ: ఎల్‌ఆర్‌ఎస్ సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ.. టేబుల్ ఎజెండాలో సభ్యుల పట్ల వివక్ష చూపిస్తూ కమిషనర్ వెంకటేశ్వర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిల్ కన్నెర్ర చేసింది. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య అధ్యక్షతన జరిగిన పురపాలిక సర్వసభ్య సమావేశం సభ్యుల ప్రశ్నలతో దద్దరిల్లింది. శానిటేషన్‌పై పర్యవేక్షణ లేకపోవడంతో వార్డులన్నీ కంపు కొడుతున్నాయని కౌన్సిలర్లు మండిపడ్డారు. అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపులో అన్యాయం చేస్తున్నారంటూ నిలదీశారు. టెండరు పూర్తి చేసుకున్న పనులను ఎందుకు ప్రారంభించడం లేదని అడిగితే.. కమిషనర్ నుంచి సమాధానం లేకపోవడంతో సభ్యులు పోడియం వద్దకు వెళ్లి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ క్రమంలో కౌన్సిలర్లు – అధికారుల మధ్య జరిగిన వాగ్వాదంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఎవరు ఏమన్నారంటే..

కౌన్సిల్ సమావేశానికి అన్ని శాఖల అధికారులు ఎందుకు రావడం లేదని మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి కౌన్సిలర్లకు పూర్తి వివరాలు ఇవ్వడం లేదని, సమాచారం కావాలని అడిగితే కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పట్టణంలో రెండు షాపింగ్ మాల్స్, ఒక రెడీమేడ్ దుకాణం కాలిపోయి కోట్ల రూపాయల నష్టం జరిగితే.. కమిషనర్ అందుబాటులో లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఫైర్ ఇంజన్లు రావడం ఆలస్యమైతే కమిషనర్ ఉండి మున్సిపల్ వాటర్ ట్యాంకర్ల ద్వారా తెప్పిస్తే కొంతమేర నష్టం తగ్గేదన్నారు. టేబుల్ ఏజెండా ఇచ్చే క్రమంలో కొంతమంది సభ్యులపై వివక్ష చూపించారని ఆరోపించారు. సభ్యురాలు గుర్రం భూలక్ష్మి మాట్లాడుతూ వార్డులో అండర్ పాస్ పనులు పూర్తి చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణిమల్లారెడ్డి మాట్లాడుతూ టెండర్ పూర్తయిన పనులను సైతం పూర్తి చేయడం లేదన్నారు. మహిళా కౌన్సిలర్లు జక్కుల అనిత, వాంకుడోతు అనిత మాట్లాడుతూ పట్టణంలో అస్తవ్యస్తంగా మారిన శానిటేషన్, ఇతర అభివృద్ధి పనుల పెండింగ్‌పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కౌన్సిలర్ గంగరబోయిన మల్లేష్ మాట్లాడుతూ వాటర్ సప్లయ్ పర్యవేక్షణలో ఉండాల్సిన ఉద్యోగి బిక్షపతిని శానిటేషన్ విభాగానికి ఎందుకు మార్చారని ప్రశ్నించారు. సభ్యురాలు మల్లిగారి చంద్రకళ, పేర్ని స్వరూప మాట్లాడుతూ తమ వార్డుల్లో పనులకు నిధులు ఎందుకు కేటాయించడం లేదని నిలదీశారు. గాదెపాక రాంచందర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో శానిటేషన్ సిబ్బంది ఎక్కడ పని చేస్తున్నారో తెలియడం లేదని, జవాన్లపై పర్యవేక్షణ లేదన్నారు. సభ్యురాలు మంత్రి సుమలత మాట్లాడుతూ ఎజెండా అంశాలకు సంబంధించి 30 మంది కౌన్సిలర్లకు సమానంగా వివరాలు ఇవ్వాలని, ఇందులో వివక్ష ఎందుకన్నారు. మారబోయిన పాండు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవల విషయమై ఇబ్బంది కలుగుతోందని, అధికారులు పర్యవేక్షించాలని అన్నారు.



కమిషనర్‌తో వాగ్వాదం చేస్తున్న కౌన్సిలర్లు

కొందరి ఒత్తిడితో పనులు చేయలేక పోతున్నా.. : కమిషనర్

రోజూ కొంతమంది తనపై ఒత్తిడి చేయడం వల్లే పనులు చేయలేక పోతున్నా.. సైలెంట్‌గా ఉంటే అన్ని పనులను చేయిస్తామని కమిషనర్ అనడంతో కౌన్సిలర్లు పోడియం వద్దకు చేరి వారెవరో చెప్పాలని పట్టుబట్టారు. సమయం వచ్చినప్పుడు చెబుతానని దాటవేయడానికి ప్రయత్నించగా పేర్లు చెప్పే వరకు ఇక్కడి నుంచి కదలమని అనడంతో కమిషనర్ నీళ్లు నమిలారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాంప్రసాద్, డీఈ చంద్రమౌళి, ఏఈ మహిపాల్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ గోపయ్య, మేనేజర్ రాములు తదితరులు ఉన్నారు.

సమగ్ర వివరాలు సేకరించాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టి సమగ్ర వివరాలు సేకరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి జిల్లా, మండల స్థాయి అధికారులతో కుటుంబ సర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వేను సమగ్రంగా నిర్వహించడానికి సిబ్బందిని నియమించామని, 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్, డేటా ఆపరేటర్‌ను కేటాయించినట్లు చెప్పారు. అలాగే 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్, ప్రతీ మండలానికి నలుగురు నోడల్ అధికారులు ఉంటారని.. వీరిని మానిటరింగ్ చేయడానికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించినట్లు వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రశ్నావళి(ఫామ్)కి అనుగుణంగా కుటుంబ సామజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ తదితర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఫార్మాట్‌లో పొందుపరచాలని సూచించారు. ఎన్యుమరేటర్, డేటా ఆపరేటర్లు సేకరించిన వివరాలను నోడల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు సుహాసిని, సుశీల, ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, కలెక్టరేట్ ఏఓ మన్సూరి, అన్ని మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

రైతులకు రూ.5కే భోజనం

- మార్కెట్ చైర్మన్ శివరాజ్‌యాదవ్
- పాలక మండలి సమావేశంలో ఆరు అంశాలకు ఆమోదం

జనగామ: వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించడానికి జనగామ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతులకు రూ.5కే భోజన సౌకర్యం కల్పించేలా క్యాంటీన్ ఏర్పాటుకు మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి తీర్మానించిందని మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ తెలిపారు. మార్కెట్ నూతన కమిటీ మొదటి పాలక మండలి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధి కోసం ప్రధాన ఎజెండాలోని ఆరు అంశాలపై చర్చించి పాలక మండలి తీర్మానించిందని చెప్పారు. అందులో ప్రధానంగా.. మార్కెట్‌కు వచ్చే రైతులకు రూ.5కే భోజన సౌకర్యం, మార్కెట్ ఆవరణలో అదనంగా రెండు కవర్ షెడ్ల నిర్మాణం, మార్కెట్‌యార్డులో సీసీ రోడ్ల ఏర్పాటు, యార్డు మొత్తం సీసీ కెమెరాల బిగింపు, రైతులకు విశ్రాంతి భవనం, యార్డులో డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు అంశాలను పాలకమండలి ఏకగ్రీవంగా ఆమోదించిందని చెప్పారు. మార్కెట్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి నర్సింహులు, కార్యదర్శి శ్రీనివాస్, డైరెక్టర్లు గాదె రమేష్, బొట్ల నర్సింగరావు, బానోతు బన్ని, నీల మోహన్, గంగిడి నర్సింహారెడ్డి, బుట్టిరెడ్డి శ్రీలతరెడ్డి, నాగబండి రవీందర్, నామాల శ్రీనివాస్, బంధ కుమార్, ఎండీ.బస్‌మియా, శీలం కొండల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



చాంబర్‌లో మాట్లాడుతున్న చైర్మన్ శివరాజ్

విద్యార్థుల ప్రొఫైల్ పూర్తి చేయాలి

- అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: యూడైస్ ప్లస్‌లో ప్రతీ విద్యార్థి జనరల్, ఎడ్యుకేషన్ ప్రొఫైల్ త్వరగా పూర్తి చేయాలని విద్యాశాఖ జిల్లా అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఛాగల్లు ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ఘన్‌పూర్ ప్రాథమిక పాఠశాల, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించిన అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. యూడైస్ ప్లస్‌లో విద్యార్థుల ప్రొఫైల్‌తో పాటు ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌ను 100 శాతం రోజూ పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల హాజరును నిత్యం ఉదయం 10.30 గంటల లోపు జిల్లా విద్యాశాఖకు పంపించాలని తెలిపారు. విద్యార్థుల వివరాలు ఆధార్ కార్డులలో, విద్యార్థి నమోదు రిజిస్టర్లలో ఒకేలా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సదామోహన్, సోమనారాయణ, రామకృష్ణ, కృతమూర్తి, ఎమ్మార్సీ సిబ్బంది గిరి, సునీత, లవన్, జ్యోతి, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

సమస్యలకు పరిష్కారమేది..?

- ఏళ్ల తరబడి తిరుగుతున్నా ఫలితం లేదు
- గ్రీవెన్స్‌లో అర్జీదారుల ఆవేదన
- వివిధ సమస్యలపై 38 వినతులు
- స్వీకరించిన కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ఏ ఆధారం లేదు.. వితంతు పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని ఒకరు.. కుమారుడు మానసిక వికలాంగుడు.. ఆర్థికంగా ఆసరా కల్పించాలని మరొకరు.. భూమి ఆక్రమించాలని చూస్తున్నారు.. పట్టాలో పేరు సరిచేయాలని ఓ రైతు ఇలా అనేక సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. ఏళ్ల తరబడి తిరుగుతున్నా తమ బాధలు తీరడంలేదని వారు వాపోయారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 38 వినతులు రాగా కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిశీలించి తమ పరిధిలోని వాటిని పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో అర్జీదారులకు తగిన వివరణ ఇవ్వాలని ఈ సందర్భంగా సూచించారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

అర్జీల్లో కొన్ని ఇలా..

- తన భర్త లక్ష్మయ్య 2020లో మరణించాడు.. వితంతు పింఛన్ మంజూరు చేయాలని చిల్పూర్ మండలం రాజవరం గ్రామానికి చెందిన బైరగోని రాజేశ్వరి అర్జీ పెట్టుకున్నారు.
- తన కుమార్తె లాస్యకి పాలకుర్తి సాంఘిక సంక్షేమ హాస్టల్ 7వ తరగతి చదవడానికి సీటు ఇప్పించాలని పాలకుర్తి మండలం శాతాపురం గ్రామానికి చెందిన బైరెల్లి శ్రీను కలెక్టర్‌ను కోరారు.
- బిల్డింగ్ పర్మిషన్ కోసం అప్లై చేశాను. దానిని పరిశీలించి అనుమతి ఇప్పించాలని చిల్పూర్ మండలం వంగాలపల్లికి చెందిన వీరవరం రాజిరెడ్డి కోరారు.

భూమి కొలిచి పట్టాచేయించాలి



గ్రామంలో నా తండ్రి జక్కుల గట్టయ్య 2011లో 26 గుంటల భూమి కొనుగోలు చేశాడు. అప్పుడు ధరణిలో మరొకరి పేరు పడింది. మార్పు చేయాలని అధికారులు చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదు. 2019లో నా తండ్రి మృతి చెందాడు. భూమి కొలిచి నా పేరిట పట్టాచేయించాలి.

- జక్కుల సుధాకర్, కిష్టాజిగూడెం



పక్క ఫొటోలోని బాలుడి పేరు పడిశ ప్రసాద్. పాలకుర్తి మండలం లక్ష్మీ నారాయణపురం గ్రామానికి చెందిన ఇతను పుట్టకతోనే మానసికంగా వికలాంగుడు. సదరం క్యాంపునకు వెళ్తే 65 శాతం వైకల్యంతో సర్టిఫికెట్ ఇచ్చారు. రెండేళ్ల క్రితం పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇంత వరకు రాలేదు. 'తన కుమారుడు పూర్తి అర్హుడు.. పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి' అని ప్రసాద్ తండ్రి భాస్కర్ కలెక్టర్‌ను వేడుకున్నారు.

పింఛన్ మంజూరు చేయాలి



నా భర్త గంట ప్రభాకర్ అనారోగ్యంతో మంచానపడి రెండేళ్ల క్రితం మృతి చెందాడు. నిలువ నీడలేదు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణ భారంగా మారింది. వితంతు పింఛన్‌తోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి. తన భర్త మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యత్వం కలిగి ఉన్నాడు. మాకు రావలసిన ఇన్సూరెన్స్ డబ్బులు ఇప్పించడంతోపాటు తమకు సంఘంలో సభ్యత్వం ఇప్పించాలి.

- గంట కవిత, వల్మిడి(పాలకుర్తి)

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి : ఎమ్మెల్యే



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కడియం

చిల్పూరు: కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.. ఈ విషయంలో ఫిర్యాదులు వస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల పరిధి పల్లగుట్ట, వెంకటాద్రిపేట గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లావణ్యశిరీష్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా కేంద్రాల్లో టార్పాలిన్, గోనె సంచులు సిద్ధంగా ఉంచాలని, లారీలోడ్ కాగానే మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. తహసీల్దార్ సరస్వతి, ఐకేపీ ఏపీఎం రమేష్‌కుమార్, ఏఓ నజీరుద్దీన్, చిల్పూరు ఆలయ మాజీ చైర్మన్ శ్రీధర్‌రావు, నాయకులు చిర్ర నాగరాజు, ఎన్నకూస కుమార్, దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల బాధ్యత గొప్పది



ఓపెన్ హౌస్‌లో గన్ గురిపెట్టిన కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన డీసీపీ, ఏసీపీ, సీఐలు

- ఓపెన్ హౌస్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: దేశంలో పోలీసుల బాధ్యత గొప్పదని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. పోలీస్ అమరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని ఓంసాయి గార్డెన్‌లో డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆధ్వర్యాన 'ఓపెన్ హౌస్' నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలో అనేక వింగ్‌లలో కేటగిరీల వారీగా పోలీసులు శాంతి భద్రతల కోసం పని చేస్తున్నారని, విద్యార్థి దశలోనే పోలీసు సేవలు, వారు ఉపయోగించే ఆయుధాలపై అవగాహన ఉంటే సమాజానికి ఉపయోగపడతారని పేర్కొన్నారు. అనంతరం ప్రదర్శనకు ఉంచిన గన్స్, ఇతర మందుగుండు సామగ్రి, పోలీసు డాగ్స్ గురించి పోలీసులు వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ పార్థసారధి, సీఐలు దామోదర్‌రెడ్డి, అబ్బయ్య, ఎస్సైలు భరత్, రాజేష్, చెన్నకేశవులు, శ్వేత ఉన్నారు.



తుపాకులు, మందుగుండు సామగ్రి గురించి విద్యార్థులకు వివరిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

గురువులే మార్గదర్శకులు..

విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్ కుమార్



హన్మకొండ కల్చరల్: గురువులే శిష్యులకు మార్గదర్శకులని విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ నాడ్గొడ సుధీర్ కుమార్ అన్నారు. సోమవారం వరంగల్ విజ్ఞాన పీఠం ఆడిటోరియంలో హిందుస్థానీ గాత్రం, సితార్, కర్ణాటక, వయోలిన్, కూచిపూడి, పేరిణి నృత్య విభాగం అధ్యాపకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డిప్లొమా, సంగీత, నృత్య కోర్సుల విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రముఖ సంగీత విద్వాంసులు, కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ దివంగత ఆకెళ్ల మల్లికార్జున శర్మకు నివాళులర్పించి అనంతరం సుధీర్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మృదంగ విద్వాంసులు వై. భీమ్‌శంకర్, హిందుస్థానీ గాత్రం, సితార్, వాయోలీన్ అధ్యాపకులు అనుముల యోష, జక్కోజు సత్యనారాయణ, చిన్నికృష్ణ, కర్ణాటక గాత్రం విద్వాంసులు సింగారపు భాస్కర్, పేరిణి అధ్యాపకురాలు చాతరాజు నవ్యజ, కళాశాల సిబ్బంది గడ్డం శంకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

వితంతువుపై ఆటో డ్రైవర్ లైంగికదాడి

బచ్చన్నపేట: దారి వెంట నడుచుకుంటూ వస్తున్న ఓ వితంతువును ఆటోలో ఎక్కించుకున్న డ్రైవర్.. ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలో జరిగింది. బాధితురాలు, పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన వితంతువు హైదరాబాద్‌లో ఉంటూ పింఛన్ తీసుకోవడానికి స్వగ్రామానికి దగ్గరి గ్రామంలో బస్సు దిగి నడుచుకుంటూ వస్తోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ డ్రైవర్ ఆటోలో ఎక్కించుకొని వస్తూ మార్గమధ్యలో ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం బచ్చన్నపేట, జగదేవపూర్ ఎస్సైలు ఎస్కే హమీద్, చంద్రమోహన్ ఘటనా స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆటో డ్రైవర్‌పై జగదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల రద్దు



కాజీపేట అర్బన్ : వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఒకేసారి 12 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను సబ్ రిజిస్ట్రార్లు సోమవారం రద్దు చేశారు. వీటిలో అక్రమ, డబుల్, అనుమతి లేని డాక్యుమెంట్లు ఉన్నాయా? అనే విషయం తెలియాల్సి ఉంది. కాగా, బదిలీ అయిన రిజిస్ట్రార్లు చేసిన డాక్యుమెంట్లా లేక ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్లు ఆనంద్, రామనరసింహారావు చేసిన డాక్యుమెంట్లా అనే విషయం సైతం అధికారులు తేల్చాల్సి ఉంది. ఏకకాలంలో అన్ని రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఎందుకు రద్దు చేశారు..అక్రమాలు బయటపడకుండా అలా చేశారా? అని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చర్చించుకుంటున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లు అయితే డీఐజీ, ఐజీ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

రికార్డు స్థాయిలో 131 డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్..

వరంగల్ ఆర్వో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజూ 60 నుంచి 80 దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేస్తారు. కాగా, సబ్ రిజిస్ట్రార్లు సోమవారం రికార్డు స్థాయిలో 131 డాక్యుమెంట్లు చేశారు.

ఆరా తీస్తున్న అధికారులు..

భద్రు అక్రమ దందా వెనుక ఉన్న అధికారులు, ఇతర రాజకీయ నాయకుల పాత్రపై అధికారులు ఆరా తీయడంతో పాటు ఎంత మంది రైతులు డబ్బులు సమర్పించుకున్నారో.. ఎంత మంది రైతులకు నకిలీ పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇచ్చాడో.. అందులో ఎంత మంది రుణాలు తీసుకున్నారో అనే విషయాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. కలెక్టర్ కూడా మూడు రోజుల క్రితం కొంత మంది రెవెన్యూ అధికారులతో మాట్లాడినట్లు సమాచారం. రైతులు, ప్రభుత్వాన్ని మోసం చేసిన భద్రు.. నకిలీ పట్టాదార్ పాస్ పుస్తకాలు ఎక్కడెక్కడ తయారు చేస్తున్నారనే అంశాన్ని కనుగొనే యత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపురం, నల్లబెల్లి మండలాల్లో జరిగిన ఈ వ్యవహారంపై పూర్తి వివరాలను సేకరించే ప్రయత్నంలో అధికారులు ఉన్నారు.



భద్రు వెనుక బడా నాయకులు

నకిలీ పట్టాదార్ పాస్ పుస్తకాల తయారీలో భారీగా వసూళ్లు

- భద్రుకు సహకరించిన వారిపై పోలీసుల ఆరా
- బాధిత రైతుల వివరాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి..

నర్సంపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలో నకిలీ పట్టాదార్ పాస్‌పుస్తకాల తయారీ ముఠాలో ప్రధాన సూత్రదారి భద్రు వెనుక బడా నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. పోడు భూములకు నకిలీ పట్టాదార్ పాస్ పుస్తకాలను తయారీ చేసిన భద్రు.. వేలాది రూపాయలు వసూలు చేసినట్లు తమ విచారణలో బహిర్గతం కావడంతో అతడిని పోలీసులు ములుగులో అరెస్ట్ చేసిన విషయం విధితమే. ములుగు, వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాలతో పాటు మహబూబాబాద్ జిల్లాలో ఈ అక్రమ దందా భారీగానే జరిగి ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారం మొత్తంలో భద్రుకు ఎవరెవరు సహకరించి ఉంటారనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో కొందరు బ్యాంకు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉంటారని, లేదంటే భద్రు ఇంతటి ఘరానా మోసంలో ఎలా ముందుకు సాగి ఉంటాడని అనుమానిస్తున్నారు.

అసలు భద్రు ఎవరు!

నర్సంపేట నియోజకవర్గంలోని మగ్దుంపురం గ్రామానికి చెందిన భద్రు ఏడో తరగతి వరకే చదువుకున్నాడు. అయినా అటు ప్రభుత్వాన్ని ఇటు రైతులను మోసం చేసే స్థాయికి ఎదగడం వెనుక మరికొంత మంది సహకారం అందించినట్లు తెలుస్తోంది. పోడు భూమిని సాగు చేసుకుంటున్న రైతులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత సంవత్సరం హక్కు పత్రాలు అందజేసింది. ఈ విషయం తెలుసుకున్న భద్రు.. అటవీ శాఖలోని కొందరి అధికారుల సహకారంతో హక్కు పత్రాలు రాని రైతుల వివరాలు సేకరించి వారి వద్దకు తన అనుచరులను పంపించి పట్టాదార్ పాస్ పుస్తకాలు తీసుకువస్తానని వేలాది రూపాయలు వారి వద్ద నుంచి దండుకున్నట్లు తెలుస్తోంది. అటవీ భూములతో పాటు అసైన్డ్ భూములు పట్టా పాస్‌పుస్తకాలు లేని భూములకు చెందిన రైతుల వివరాలను తెలుసుకుని వరంగల్ కేంద్రంలో నకిలీ పట్టాదార్ పాస్ పుస్తకాలు తయారు చేసుకొని కొందరి రైతులకు అందించిన భద్రు వ్యవహారాన్ని ములుగు పోలీసులు బహిర్గతం చేశారు. భారీగా డబ్బులు దండుకున్న భద్రు తన మాట వినని బ్యాంకు అధికారులు, ఇతర ప్రభుత్వ సిబ్బందిపై కూడా జులుం ప్రదర్శించే వాడని, ఇందులో భాగంగానే రుణాలు ఇవ్వడానికి ఆసక్తి చూపని నర్సంపేటలోని కొందరి అధికారులతో ఘర్షణకు దిగినట్లు తెలిసింది. చాలా మంది రైతుల నుంచి పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇస్తామని డబ్బులు వసూలు చేసిన భద్రు ఉదంతం తెలుసుకున్న రైతులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.

పుస్తకం తీసుకుని ఇవ్వలేదు



మాది కొత్తూరు గ్రామం. నాకు మాటు విరారం కింద ఎకరంన్నర భూమి ఉంది. దీనిని రెండున్నర ఎకరాలు చేస్తానని చెప్పి ఒరిజినల్ పట్టాదార్ పుస్తకం తీసుకెళ్లాడు. రూ.5వేలు కూడా ఇచ్చా. కొత్త లోను కూడా ఇప్పిస్తానని చెప్పాడు. నా భార్య బాగా లేకపోవడంతో ఆస్పత్రుల చుట్టూ తిరిగా. పుస్తకం ఇవ్వమని అడిగితే రేపుమాపు అంటూ తిప్పాడు. పుస్తకం ఇప్పటి వరకూ ఇవ్వలేదు. అధికారులు నాకు న్యాయం చేయాలి.

– మండల రవి, కొత్తూరు

కళాక్షేత్రంలో విగ్రహాలు ఏర్పాటు చేయాలి

హన్మకొండ అర్బన్ : నగరంలోని బాలసముద్రంలో నిర్మించిన కళాక్షేత్రంలో తెలంగాణ రాష్ట్ర సాధనలో పాలుపంచుకున్న కళాకారుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, సౌత్ ఇండియా స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కళాక్షేత్రంలో తెలంగాణ కళాకారుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆయా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తా నుంచి బాలసముద్రంలోని కళాక్షేత్రం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జానపదాలు, ఒగ్గు కథ, బుర్రకథ లాంటి కళారూపాలతో తెలంగాణ గొప్పతనాన్ని దేశవ్యాప్తంగా చాటిన, పద్మశ్రీ అవార్డు సాధించిన కళాకారుల విగ్రహాలను కళాక్షేత్రంలో ఏర్పాటు చేయాలన్నారు. దీని కోసం మూడు నెలలుగా ఉద్యమిస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కళలు, కళాకారులతో సంబంధం లేని వ్యక్తుల పేర్లు, వారి విగ్రహాలను కళాక్షేత్రంలో ఏర్పాటు చేయడం సరికాదన్నారు. తెలంగాణకు చెందిన గద్దర్, చుక్క సత్తయ్య, మిద్దె రాములు, చిందు ఎల్లమ్మ, సాయిచంద్, బెల్లి లలిత, నేరెళ్ల వేణుమాధవ్, వరంగల్ శంకరన్న, సారంగపాణి, గుస్సాడీ నత్యంలో పద్మశ్రీ అవార్డు పొందిన కనకరాజు వంటి కళాకారుల విగ్రహాలను కళాక్షేత్రంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు వందలాదిగా కళాక్షేత్రం వద్దకు చేరడంతో పోలీసులు నిలువరించే యత్నంలో వారి మధ్య తోపులాట జరిగి కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కొందరు విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్ తరలించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఠాగూర్, మణితేజ, కుమార్, కలాం, నదీంపాషా, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

- జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బాధ్యుడు కైలాస్‌యాదవ్
- ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి జూడో పోటీలు ప్రారంభం

వరంగల్ స్పోర్ట్స్: పాఠశాల క్రీడల సమాఖ్య అండర్–17 రాష్ట్ర స్థాయి బాలబాలికల జూడో పోటీలు సోమవారం సాయంత్రం వరంగల్ పోచమ్మమైదాన్‌లోని కెమిస్ట్ భవన్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బాధ్యుడు బైరబోయిన కై లాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. క్రీడాకారులు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఆడాలని సూచించారు. ఎస్‌జీఎఫ్ అండర్–14, 17 హనుమకొండ జిల్లా కార్యదర్శి దస్రూనాయక్ మాట్లాడుతూ ఉమ్మడి 9 జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు, 20 మంది రెఫరీలు హాజరైనట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన బాలురు నవంబర్ 5 నుంచి 9వ తేదీ వరకు జమ్మూలో, బాలికలు డిసెంబర్ 12 నుంచి 17వ తేదీ వరకు అగర్తలాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



రాష్ట్ర స్థాయి జూడో పోటీలను ప్రారంభిస్తున్న కైలాస్‌యాదవ్

నిశ్చితార్థం చేసుకుని.. పెళ్లికి నిరాకరించి

- ప్రేమపేరుతో పెళ్లికి నో చెప్పిన కానిస్టేబుల్
- యువతి కుటుంబ సభ్యుల ఆందోళన
- కేయూ పీఎస్‌లో ఫిర్యాదు.. కేసు నమోదు

హసన్‌పర్తి: ఎన్నో ఆశలతో కొత్త జీవితంలోకి అడుగు పెట్టాలనుకున్న ఓ యువతిని కానిస్టేబుల్ మోసగించాడు. నిశ్చితార్థం అయిన తర్వాత పెళ్లికి నిరాకరించాడు. తనను ప్రేమికురాలు ఉందని బుకాయించాడు. షాక్‌కు గురైన యువతి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కాకతీయ యూనివర్సిటీపోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన కావటి వినయ్ ములుగు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈనెల వినయ్‌కు యాదవనగర్‌కు చెందిన లింగంపల్లి కుమార్ కూతురితో నిశ్చితార్థం జరిగింది. కట్నం కింద రూ.20లక్షలు నగదుతో పాటు బంగారు ఆభరణాలు ఇవ్వడానికి కుమార్ కుటుంబీకులు ఒప్పుకున్నారు. నిశ్చితార్థం సందర్భంగా వినయ్‌కు కట్నం కింద రూ. లక్ష నగదు ఇచ్చారు.

మరో యువతిని ప్రేమిస్తున్నానని..

కాగా, కట్నం సరిపోవడం లేదని, మరో యువతితో ప్రేమలో ఉన్నానని వినయ్ పెళ్లికి నిరాకరించాడు. ఈనెల 23వ తేదీన వధువు కుటుంబ సభ్యులకు సమాచారం పంపాడు. ఇందుకు ఖంగుతిన్న యువతి కుటుంబసభ్యులు లబోదిబోమంటూ కానిస్టేబుల్ వినయ్‌తో పాటు అతడి కుటుంబసభ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాకతీయ యూనివర్సిటీ పోలీసులను ఆశ్రయించారు.

క్రీడాకారులు వసతులు వినియోగించుకోవాలి

- కిట్స్ కళాశాల డీన్ రమేశ్‌రెడ్డి
- కొనసాగుతున్న ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడలు

వరంగల్ స్పోర్ట్స్: ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, అవకాశాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కిట్స్ కళాశాల డీన్ (అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ పింగిళి రమేశ్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్–19 క్రీడా పోటీలను సోమవారం రమేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడా పాలసీ ద్వారా ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తుందన్నారు. క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి, హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ వరకు పోటీలు కొనసాగుతాయని తెలిపారు. మూడో రోజు హ్యాండ్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఉషు, టెన్నికాయిట్, సాఫ్ట్‌టెన్నిస్, మాల్కంబ్, సెపక్‌తక్రా క్రీడల్లో పోటీలు నిర్వహించగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి వెయ్యి మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ కోచ్‌లు నరేందర్, కూరపాటి రమేశ్, కొత్త ప్రశాంత్, బొడ్డ విష్ణువర్ధన్, అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు పోగుల అశోక్, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రమేశ్‌రెడ్డి

ఆర్టీసీలో యూనియన్లపై ఆంక్షలు ఎత్తేయాలి

- ఎస్‌డబ్ల్యూఎఫ్ వరంగల్ రీజియన్ అధ్యక్షుడు రాంచందర్



హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీలో యూనియన్లపై ఉన్న ఆంక్షలు ఎత్తివేయాలని, ప్రజాతంత్ర హక్కులు పునరుద్ధరించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వరంగల్ రీజియన్ (ఉమ్మడి వరంగల్ జిల్లా) అధ్యక్షుడు సి.హెచ్.రాంచందర్ డిమాండ్ చేశారు. 2019లో జరిగిన 55 రోజుల సమ్మె సందర్భంలో కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని పాలకులు చేసిన కుయుక్తులు ఫలించలేదని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. కార్మికుల ఐక్యత ముందు పాలకులు తలవంచక తప్పలేదన్నారు. సమ్మె సమయంలోని అనేక డిమాండ్లు పరిష్కరించాల్సి వచ్చిందన్నారు. కార్మికులంత ఐక్యతంగా ఉన్నారనే కారణంతో అప్పటి ప్రభుత్వం కార్మిక యూనియన్‌లపై ఆంక్షలు విధించారన్నారు. ఏ చట్టంలో లేని సంక్షేమ బోర్డులను తీసుకువచ్చిందని దుయ్యబట్టారు. సంస్థ నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

ఈడబ్ల్యూఎస్‌కు భంగం కలిగించొద్దు

- రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: 'కొందరు ఈడబ్ల్యూఎస్ (ఎకనామికల్లీ వీకర్ సెక్షన్) ను రద్దు చేయాలని ప్రకటనలు చేస్తున్నారు.. ఈ రిజర్వేషన్‌కు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదు' అని తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి హెచ్చరించారు. హనుమకొండలోని బ్రాహ్మణ భవన్‌లో సోమవారం ఓసీ జేఏసీ సమావేశం జరి గింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో అగ్రవర్ణ పేదలకు న్యాయం జరగాలని చేసిన ఉద్యమాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ ద్వారా విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో 10శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. తెలంగాణలో రెండేళ్ల పాటు జరిగిన సుదీర్ఘ ఓసీల ఉద్యమం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుంటే సహించలేని కొందరు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను రద్దు చేయాలని వినతిపత్రాలు, పత్రికా ప్రకటనలు ఇస్తున్నారన్నారు. ఈ రిజర్వేషన్‌కు భంగం కలిగించేలా చేస్తున్న చర్యలను తిప్పికొట్టేందుకు భవిష్యత్ కార్యాచరణ కోసం త్వరలోనే రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు గంగు ఉపేంద్రశర్మ, వెన్నెంపల్లి జగన్మోహన్‌శర్మ, ఏవీ సత్యమోహన్, జీవీఎస్ శ్రీనివాసాచార్యులు, కమ్మ సేవా సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి గంగవరపు శ్రీరామకృష్ణప్రసాద్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగేటి అశోక్, చకిలం రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్ వర్మ, అర్జుల కిషన్‌రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఓసీ జేఏసీ నాయకులు

అణిచివేత నుంచే స్త్రీల కథలు వచ్చాయి

- పొట్టిశ్రీరాములు తెలుగువర్సిటీ మాజీ వీసీ భూమయ్య



మాట్లాడుతున్న మాజీ వీసీ భూమయ్య

విద్యారణ్యపురి: అణిచివేత, వివక్షకు గురికావడం వల్లనే స్త్రీల కథలు వచ్చాయని పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య అనుమాండ్ల భూమయ్య అన్నారు. సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'తెలుగులో స్త్రీల కథాసాహిత్య ధోరణులు' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో ప్రాచీన కాలం నుంచి నేటి వరకు స్త్రీలు వివక్షకు గురవుతూనే ఉన్నారన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కేయూ తెలుగు విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే కీలకోపన్యాసం చేస్తూ బండారు అచ్చమాంబ మొదలు నేటి వరకు ఎంతో మంది స్త్రీలు తమ సమస్యలను ప్రతిబింబించేలా 1898 నుంచి స్త్రీల కథలు రాస్తున్నారన్నారు. కథా సాహిత్యానికి 124 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. మొట్టమొదట స్త్రీల సమస్యలపై పురుషులే కథలు రాసినప్పటికీ తర్వాత స్త్రీలే తమతమ సమస్యలపై తామే కథలుగా చిత్రీకరించారన్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యల నుంచి బయటపడి కథలు రాయాలన్నారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య మాట్లాడుతూ స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను కథలుగా రాసిన రచయిత్రులను ప్రస్తావిస్తూ వారు సమసమాజ నిర్మాణానికి ఏ విధంగా దోహదపడ్డారో వివరించారు. సభకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి అధ్యక్షత వహించారు. సదస్సు కన్వీనర్ మధు, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ సురేశ్‌బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.అరుణ, రచయిత్రి అనిశెట్టి రజిత, అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా, ఈ సదస్సులో 80 మంది రాసిన పరిశోధన పత్రాల వ్యాసాలను ఐఎస్‌బీఎన్‌తో కూడిన సాఫ్ట్‌వేర్‌ను భూమయ్య ఆవిష్కరించారు.

ధర తగ్గింపుపై రైతుల ఆందోళన

- తేమ శాతం వల్లే తక్కువ ధరలంటున్న వ్యాపారులు
- ఆధార్ వెరిఫికేషన్‌పై అవగాహన కల్పించిన సీసీఐ అధికారులు

వరంగల్ : వరంగల్ వ్యవసాయ మార్కెట్ పత్తి యార్డులో క్వింటాల్‌కు రూ.7వేలకు తక్కువగా ధర నిర్ణయించడంతో రైతులు ఆగ్రహానికి గురై ఆందోళనలు చేపట్టారు. సోమవారం మార్కెట్ ప్రారంభం కాగానే జెండా పాటలో క్వింటాల్ పత్తికి గరిష్ట ధర రూ.6,800 నిర్ణయం కావడంతో వ్యాపారులు కుమ్మక్కై ధర తగ్గించారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)రూ.7521 పెట్టినందున రూ.7వేలకు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తేమ శాతం ఎక్కువ ఉన్నందున ధర పెంచలేమని వ్యాపారులు మొండికేయడంతో కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది. రైతులు పత్తి యార్డు ఆఫీసు వద్దకు వచ్చి బోర్డుపై ఉన్న ధరలపై అసంతృప్తి వ్యక్తం చేయడంతో మార్కెట్ సిబ్బంది పట్టికపై ఉన్న ధరను తుడిచివేశారు. తేమ 8–12 శాతం వరకు ఉంటే సీసీఐ ప్రకటించిన విధంగా ధర చెల్లించి కొనుగోలు చేస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌కు వచ్చిన పత్తి 27 శాతం తేమ నమోదు అవుతున్నందున రూ.6800 కంటే ఎక్కువ పెట్టలేమని కొనుగోలుదారులు తెలిపారు. అనంతరం యథావిధిగా పత్తి కొనుగోళ్లు ప్రారంభం కావడంతో వివాదం సద్దుమణిగింది. పత్తి యార్డులో ఆధార్ వెరిఫికేషన్‌పై రైతులకు సీసీఐ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ ఉన్నత కార్యదర్శి పి.నిర్మల, సీసీఐ యార్డు పర్చేజింగ్ అధికారి కృష్ణారెడ్డి, గ్రేడ్–2 కార్యదర్శి రాము, సూపర్‌వైజర్ గంగాధర్, వ్యాపారులు పాల్గొన్నారు. సోమవారం సుమారు 10 వేల బస్తాలకు పైగా పత్తి వచ్చిందని అధికారులు తెలిపారు.

తేమ లేని లూజు పత్తి తీసుకురావాలి

సీసీఐ నిబంధనల మేరకు 8–12 శాతం తేమ ఉండాలని, అదే విధంగా పత్తి లూజుగా తీసుకురావాలని, బస్తాల్లో తీసుకొస్తే సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు చేయలేరని మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల తెలిపారు. పత్తి సేకరించిన అనంతరం నీడలోనే ఆరపెట్టి నాణ్యత ప్రమాణాలతో పత్తి తీసుకొచ్చి మద్దతు ధరలను పొందాలని రైతులను కోరారు.



ఆధార్ వెరిఫికేషన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న సీసీఐ అధికారులు

పురుగుల మందు తాగి విద్యార్థి ఆత్మహత్య



గణేశ్(ఫైల్)

వర్ధన్నపేట: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి అప్పుల పాలై తీవ్ర మనోవేదనకు గురైన బీటెక్ చదువుతున్న ఓ విద్యార్థి పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కడారిగూడెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కడారిగూడెం గ్రామానికి చెందిన బత్తిని గణేశ్(26) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో స్నేహితుల వద్ద సుమారు రూ.7 లక్షలు అప్పు తీసుకున్నాడు. స్నేహితులు ఇచ్చిన డబ్బును చెల్లించాలని ఒత్తిడికి గురిచేశారు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురైన గణేశ్ హైదరాబాద్‌లోని తన గదిలో బుధవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి తల్లి సంధ్య, తండ్రి దేవేందర్, సోదరి ఉంది.

తెలంగాణ నటులను ప్రోత్సహించాలి

- తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపకుడు పృథ్వీరాజ్ యాదవ్
- అలరించిన ఓరుగల్లు జానపద స్వరాల జల్లు

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ నుంచి హీరోలు రావాలని, ఇక్కడి నటులను ప్రోత్సహించాలని తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపకుడు సంఘంరెడ్డి పృథ్వీరాజ్ యాదవ్ అన్నారు. వరంగల్ జేబీ కల్చరల్ సొసైటీ 25 వసంతాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఓరుగల్లు జానపద స్వరాలు ఆటపాటల జాతర–2024 ఆదివారం రాత్రి హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడల శివ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పృథ్వీరాజ్ యాదవ్, నీరటి ప్రణయ్‌కుమార్, సినీ గాయకులు కాసర్ల శ్యామ్, గేయ రచయిత వరంగల్ శ్రీనివాస్, ప్రజాకవి గాయకులు నాగరాజు, భూక్య సుశీల తదితరులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం పృథ్వీరాజ్ యాదవ్ మాట్లాడుతూ గానగంధర్వులు వరంగల్ శంకర్, దీకొండ సారంగపాణిల విగ్రహాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాసర్ల శ్యామ్ మాట్లాడుతూ శంకరన్న, సారంగపాణితో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నానని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ కళాకారులకు గానగంధర్వులు దివంగత వరంగల్ శంకర్, దీకొండ సారంగపాణి స్మారకంగా కీర్తి పురస్కారాలను అందజేశారు. అతిథులు, నిర్వాహకులు జడల శివ, హరితను అభినందించారు. కార్యక్రమంలో కళాకారులు సీతాల రఘువేందర్, నాగేశ్వరరావు, లేటి శ్యామ్, టీవీ అశోక్‌కుమార్, కళారాజేశ్వరరావు, ఓడపల్లి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న అతిథులు